# ఆవకాయ పురాణం



**పోతనకూ దక్కలేదు ఈ అదృష్టం. 'అల వైకుంఠపురములో.. నగరిలో.. ఆ మూల సౌధంబుదాపల..' వరకూ దర్శించినా అమృతాన్ని మించిన అరుదైన ఆవకాయను కనిపెట్టలేకపోయాడు. అష్టదిగ్గజాలకూ చిక్కలేదు ఈ యోగం. రాయల వారిచ్చిన మణులూ, మాన్యాలకే పొంగిపోయారు తప్ప.. కొత్తజాడీలోని పాత ఆవకాయ రుచిచూసి ఎరుగరు. ఆ మాటకొస్తే... నిండు చందురుణ్ని చూస్తూ గోరుముద్దలు ఆరగించిన రామచంద్రుడికీ దక్కలేదు ఆవకాయ వాయ! ద్వాపర యుగం నాటికి ఆవకాయ పుట్టి ఉంటే.. కిట్టయ్య కన్ను ఉట్టి మీది వెన్నపై ఎందుకు పడేది! ఎంచక్కా తొక్కుల అర్రలోకి జొర్రి 'ఆవకాయ దొంగ'న్న నామంతో లోకప్రసిద్ధి చెందేవాడేమో! ఇన్ని కబుర్లు ఎందుకంటే, ఇంటింటా కారాలు కలిపే ముహూర్తం వచ్చింది. మన తెలుగింటికే సొంతమైన ఆవకాయ విశేషాలు చెప్పకోవద్దూ..**

ప్రు రాణాల్లో వినిపించని శబ్దం ఆవకాయ. ప్రబంధ సాహిత్యంలో కనిపించని ప్రయోగం ఆవకాయ. కానీ, ఆ వాయ లేనిదే.. తెలుగువాడికి ముద్ద దిగదు. ఓ రెండు పూటలు కష్టపడితే.. ఏడాదంతా ముప్పూటలూ ముక్కుపుటాలు అదిరే ఘుమఘుమలు సొంతం చేసుకోవచ్చు. విభిన్న పదార్థాలను మేళవిస్తూ చేసే ఆవకాయ పర్వం ఎంత ఇంపుగా ఉంటుందో! ఇప్పుడంటే ధరలు ఆకాశానికి అంటడంతో పదీ, పాతికా కాయలతో తొక్కెట్టి ఉత్సాహాన్ని తొక్కి పెడుతున్నారు కానీ, ఇరవై ఏండ్ల కిందటి దాకా నలుగురు కుటుంబసభ్యులున్న ఇంట వందకు తక్కువకాకుండా కాయలు తెగేవి. ఏం చేస్తాం.. కాల మహిమ!!

అనుభూతి చెందే మనసు ఉండాలే కానీ, ఆవకాయ ప్రహసనం బహు రంజుగా సాగుతుంది. కాయలు తీసుకురావడం నుంచి.. ఆవ కలిపే దాకా ప్రతి అంకమూ ప్రశంసనీయమే! తోటరాముడికి కాయలు తీసుకురమ్మని చెప్పడంతో అయ్యగారి హుకుం పూర్తవుతుంది. ఇంతలో అమ్మగారు షరతులు ఏకరువు పెడుతుంది. 'కాస్త చిన్నకాయలు తెంపు. ఒకే చెట్టువి ఉండాలి. కింద పడిన కాయలు సంచీలో వేయకు. పండుబారినట్టుంటే వద్దు..' ఇలా సహస్రం చెబుతుంది. 'తోటరాముడు' అన్నిటికీ ఊఁ కొడతాడే తప్ప.. ఉహ్హూ అనడు. ఎందుకంటే అమ్మగారి అత్తగారు పెట్టే ఆవకాయ అట్లా ఉంటుంది మరి! ఏడాదంతా పచ్చడి మెతుకులు తినే బతికేయొచ్చు.

కాసేపు పట్నానికి వద్దాం! ఇక్కడంతా అదృష్టానిదే పైచేయి. లేదంటే కాయలు అమ్మేవాడితో అనవసరమైన పేచి. అతను చెప్పిందే వేదవాక్కు. ప్రశస్తమైన కాయలంటూ నమ్మబలుకుతాడు. తలూపాలంతే! ఇది ఏ రకం అని అడిగితే.. కచ్చితంగా మనం కననీ, విననీ రకం పేరు చెప్పేస్తాడు. ఈ ప్రతిభను.. అమ్మకపుదారుతో బేరం ఆడటంలో ప్రదర్శిస్తే.. కాయకో రూపాయి తగ్గొచ్చు. కొనుగోలు పూర్తయ్యాక అసలు కథ మొదలవుతుంది. కాయల కోసం వెళ్తున్న తండ్రితో వెంటపడి వచ్చిన తనయుడి ఉత్సాహం కాసేపటికే నీరుగారడం ఖాయం. మార్కెట్‌కు బయల్దేరుతున్న తండ్రీకొడుకులకు 'కాయలు కొన్నాక శుభ్రంగా కడిగి, తడి లేకుండా తుడవడం తప్పనిసరి' అన్న ఇల్లాలి మాట ఆయన గారికి మరోసారి ఫోన్‌లో వినిపిస్తుంది. కుమారుడి వంక చూస్తూ.. 'ఊఁ కానీ' అంటాడు తండ్రి. కాయలన్నీ కడిగి, తుడిచి హమ్మయ్య అనుకునేంతలో.. ముక్కలు కొట్టే ప్రక్రియ షురూ!

ఇందాకటి పల్లెకు వెళ్లి.. వాళ్ల పచ్చడి సంగతి ఎంత వరకు వచ్చిందో చూద్దాం! మధ్యాహ్నానికి తొక్కుకు కావాల్సిన అల్లం, వెల్లుల్లి ముద్ద సిద్ధం చేశానన్న గర్వం ఇందాకటి అమ్మగారి కండ్లలో స్పష్టంగా గోచరిస్తుంది. ఆవ పిండి దంచుతూనో, మిక్సీ పడుతూనో ఉన్న ఆవిడ గారి అత్తగారు ఘాటుతో కుస్తీ పడుతుంటుంది. ఆవలోకి నువ్వుల నూనె తెప్పించాలని అత్తయ్య, పల్లీ నూనెతోనే రుచి అని కోడలు గతానుభవాలను ఉటంకిస్తూ ఎవరో ఒకరు పైచేయి సాధిస్తారు. ఇంతలో కాయలతో ఇంట్లోకి అడుగుపెట్టిన తోటరాముణ్ని అందరూ ఆప్యాయంగా పలకరిస్తారు. కాయలు

